## క్లుప్తంగా

### నేడు ఎమ్మెల్యే రాక

రేగొండ: రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల్లోని పలు గ్రామాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడానికి నేడు (ఆదివారం) ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

### మండల అధ్యక్షుడిగా నర్సయ్య



భూపాలపల్లి రూరల్: తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడిగా పినిగాని నర్సయ్యను నియమించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎలగొండ రాజేంద్రప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని గొర్లవీడు గ్రామానికి చెందిన నర్సయ్య పద్మశాలి కులస్తుల ఐక్యత కోసం కృషి చేస్తున్నందున నియమిస్తున్నట్లు ప్రకటించారు.

### నిధుల మంజూరుపై హర్షం

మల్హర్: మండలంలో పలు గ్రామాల్లో బీటీ రోడ్డు, సీసీ రోడ్ల నిర్మాణానికి నిధుల మంజూరు కావడంపై మాజీ ఎంపీపీ మల్హర్‌రావు శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. నిధులు మంజూరు చేసిన ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు మండల ప్రజల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### మంత్రికి కృతజ్ఞతలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండల అభివృద్ధికి రూ.1.05కోట్ల నిధులను విడుదల చేసినందుకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు మాజీ ఎంపీపీ రాణిబాయి, మాజీ జెడ్పీటీసీ గుడాల అరుణ, మాజీ సర్పంచ్ విలాస్‌రావు శనివారం వేర్వేరుగా ప్రకటనల్లో కృతజ్ఞతలు తెలిపారు. అలాగే నిధులతో పాటు మహదేవపూర్‌కు ఫైర్ స్టేషన్, 18పోస్టులు మంజూరు చేసిన మంత్రికి మహదేవూర్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోట రాజబాపు కృతజ్ఞతలు తెలిపారు.

### దళితబంధు నిధులు విడుదల చేయాలి

కాటారం: కాటారం సబ్ డివిజన్ పరిధి మండలాల్లోని లబ్ధిదారులకు గత ప్రభుత్వం హయాంలో మంజూరై ఫ్రీజింగ్‌లో ఉన్న దళిత బంధు నిధులను విడుదల చేయాలని దళిత బంధు సాధన సమితి అధ్యక్షుడు నముండ్ల సంపత్‌మహారాజ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన దళితబంధు సాధన సమితి ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలల్లో మంత్రి శ్రీధర్‌బాబు చొరవ చూపి నిధుల విడుదలకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాధన సమితి ఉపాధ్యక్షుడు వేమునూరి జక్కయ్య, బొబ్బిలి వెంకన్న, ఆత్కూరి బాలరాజు, ప్రభాకర్, నగేశ్, శంకర్ పాల్గొన్నారు.

### బాలిక కిడ్నాప్

కాటారం: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల సమీపంలో గల కాలనీకి చెందిన ఓ బాలిక(17) శనివారం కిడ్నాప్‌కు గురైంది. ఎస్సై మ్యాక అభినవ్ తెలిపిన వివరాల ప్రకారం.. బాలిక ఇంటి వద్ద ఉండగా ఓ గుర్తు తెలియని వ్యక్తి కారులో వచ్చి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు బాలిక తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపిక



రేగొండ: మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతి బాపూలే పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి వెంగల ఉజ్వల్ ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికయ్యాడు. ఎంపికైన ప్రాజెక్టును జిల్లా స్థాయిలో ప్రదర్శిస్తాడని పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలిపారు. విద్యార్థి రూపొందించిన ప్రాజెక్టును మరింత అభివృద్ధి చేసుకోవడానికి రూ.10 వేలు నగదు ప్రోత్సాహకం విద్యార్థుల ఖాతాలో జమ చేయనున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థిని ఘనంగా సన్మానించారు.

### కుంటలో పడి పశువుల కాపరి మృతి

గణపురం: మండలంలోని కర్కపల్లి గ్రామ శివారులో కుంటలో ప్రమాదవశాత్తు పడి తొర్రి సంపత్ (35) పశువుల కాపరి మృతి చెందాడు. కర్కపల్లి గ్రామానికి చెందిన సంపత్ రోజువారిలాగే పశువులను మేపడానికి శనివారం తీసుకెళ్లాడు. ఈ క్రమంలో గ్రామ పంచాయతీ వెనుక భాగంలో ఉన్న ఊర కుంటలో పశువులకు దిగడంతో సాయంత్రం పశువులను గ్రామానికి తీసుకెళ్లే క్రమంలో పశువులు కుంటలో నుంచి బయటకు రాక పోవడంతో సంపత్ వాటిని బయటకు తీసుకొచ్చేందుకు కుంటలో దిగాడు. ఈ క్రమంలో కుంటలో మట్టి తీసిన గుంతలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రానికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

# ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా..

- తాడిచర్లలోని ప్రభుత్వ బడిలో నాణ్యమైన విద్య
- విరాళాలతో పాఠశాల అభివృద్ధి



తాడిచర్ల జిల్లా పరిషత్ పాఠశాల

మల్హర్: పచ్చని చెట్లు.. ఆహ్లాదకరమైన వాతావరణం.. క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన.. ఇవన్నీ మామూలుగా కార్పొరేట్ పాఠశాలల్లో ఉండే వసతులు. అచ్చంగా అలాంటి వసతులతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తోంది మల్హర్ మండలం తాడిచర్ల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల. ఈ పాఠశాలను 1956 సంవత్సరంలో ప్రారంభించారు. 1971 నుంచి పదో తరగతి ప్రారంభమైంది. 2021-22 వరకు పాత భవనంలో కొనసాగగా పాఠశాల శిథిలావస్థకు చేరకోవడంతో జూనియర్ కళాశాల పక్కన నిర్మించిన కొత్త భవనంలోకి 2022లో తరలించారు. ప్రస్తుతం పాఠశాలలో హెచ్‌ఎం తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో 219 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

**92 శాతంపైగా ఉత్తీర్ణత**

తాడిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో ప్రతి ఏటా సుమారు 92 శాతం పైగా విద్యార్థులు ఉత్తీర్ణత సాధిస్తున్నారు. 2013-14 సంవత్సరంలో 94శాతం, 2014-15లో 94 శాతం, 2015-16లో 88శాతం, 2016-17లో 88శాతం, 2017-18లో 100 శాతం, 2018-19లో 88శాతం, 2019-20లో 100శాతం, 2020-21లో 100శాతం, 2021-22లో 100శాతం, 2022-23లో 95 శాతం, 2023-24లో 100శాతం ఉత్తీర్ణత సాధించారు.

**పాఠశాలకు దాతల విరాళాలు..**

తాడిచర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులకు స్పోర్ట్స్, డ్రెస్సులు, స్కాలర్‌షిప్, ల్యాబ్ పరికరాలు, ప్లాంటేషన్ తదితర సామగ్రిని దాతలు విరాళాలుగా అందజేశారు. 2024, జనవరిలో మంచిర్యాలకు చెందిన ఎన్‌ఆర్‌ఐ నంద శివకుమార్ ఉపాధ్యాయులకు కుర్చీలు, వాటర్ ప్లాంట్ పైపులు, అర్బన్ ప్లాంటేషన్, వాల్ బోర్డ్స్ తదితరాలకు రూ. లక్ష విరాళం అందజేశారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన నిత్య సేవాసంగ్ సంస్థ స్టేజ్ నిర్మాణానికి రూ.లక్ష, మడుపతి ప్రభాకర్ (ఎన్‌ఆర్‌ఐ, అట్లాంటా యూఎస్‌ఏ) స్పోర్ట్స్ సామగ్రికి రూ.30వేలు, పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన సీతారామ సేవాసదన్ సంస్థ పాఠశాలలో ల్యాబ్ ఏర్పాటుకు రూ.2లక్షల విరాళాలను పాఠశాలకు అందజేశారు.

**ప్రైవేట్ బడిని తలపిస్తోంది..**



మా పాఠశాలలో బోధన ప్రైవేట్ పాఠశాలలో కంటే మెరుగ్గా ఉంటుంది. ఉపాధ్యాయులు అన్నీ విధాలుగా మమ్మల్ని ప్రోత్సహిస్తున్నారు. వారి సేవలు మరవలేనివి.

– ఎ.అక్షిత, 10 తరగతి, మల్హర్

**అన్ని విషయాల్లో ముందుంటాం..**



మేము చదువులోనే కాదు అన్ని విషయాల్లోనూ ముందుంటాం. పర్యావరణ పరిరక్షణలో మావంతు సాయం అందిస్తున్నాం. పాఠశాలలో పచ్చదనానికి మరింత పోటీ పడతాం.

– ఎం.ప్రణవి, 9వ తరగతి

**తల్లిదండ్రుల సహకారంతోనే..**



పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం ఉంది. విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దేందుకు తమతో పాటు తల్లిదండ్రులు సహకరిస్తున్నారు.

– కుమారస్వామి, సీనియర్ ఉపాధ్యాయుడు

# గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రూ.9.03 కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే బంగ్లాపల్లిలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# పట్టణాల్లో ‘ఉపాధి’ అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

భూపాలపల్లి అర్బన్: మున్సిపల్ పట్టణ ప్రాంతాల్లో మహిళలకు ఉపాధిహామీ పథకం అమలు చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎస్ ప్రీతి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి చెన్నూరి రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా శనివారం ఐద్వా, సీఐటీయూ, డీవైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ, ఎన్‌పీఆర్‌డీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. మహిళలకు నరేంద్ర మోదీ ప్రభుత్వం గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నీరుగారుస్తుందన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉపాధిహామీ బడ్జెట్ కేటాయింపు తగ్గించారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజయ్య, ఆతుకూరి శ్రీకాంత్, లక్ష్మి, ఆకుదారి రమేష్, గడప శేఖర్, జ్ఞానేశ్వరి, కుమ్మరి రాజు, ఉషారాణి, కవిత పాల్గొన్నారు.

# మానేరులో తాత్కాలిక రోడ్డు నిర్మాణం

సాక్షి ఎఫెక్ట్..



మానేరులో చేస్తున్న రోడ్డు పనులు

టేకుమట్ల: మానేరులో తాత్కాలిక రోడ్డు తొలగించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ‘మానేరులో రోడ్డు కష్టాలు’ అనే శీర్షికన ‘సాక్షి’లో శనివారం కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మానేరులో పర్యటించి తొలగించిన తాత్కాలిక మట్టి రోడ్డును పునరుద్ధరించారు. గతంలో నిర్మించిన తాత్కాలిక మట్టి రోడ్డులో టోల్ వసూలు నిలిపి వేయాలంటూ కొంత మందికి అధికారులు సూచించారు. కాగా, ఈ నెల 1న టోల్ తొలగించడంతో గుర్తు తెలియని వ్యక్తులు మట్టి రోడ్డును ఈ నెల 5న తొలగించారు.

# కార్మికుల సమస్యలపై పోరాటాలు



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

భూపాలపల్లి అర్బన్: సింగరేణిలో విధులు నిర్వర్తిస్తున్న పర్మనెంట్ కార్మికులతో పాటు కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై బీఎంఎస్ ఆధ్వర్యంలో పోరాటాలను నిర్వహించేందుకు సిద్ధమైనట్లు సింగరేణి కోల్‌మైన్ కార్మిక సంఘం అనుబంధ ఆలిండియా కోల్ సెక్టార్ ఇన్‌చార్జ్ కొత్తకాపు లక్ష్మారెడ్డి తెలిపారు. ఏరియాలోని యూనియన్ కార్యాలయంలో శనివారం కార్మిక పోరాటాల కార్యాచరణ సమావేశం నిర్వహించారు. బ్రాంచ్ ఉపాధ్యక్షుడు సుజేందర్ అధ్యక్షతన ఏర్పాటుచేయగా ముఖ్యఅతిథిగా లక్ష్మారెడ్డి హాజరై మాట్లాడారు. సింగరేణితో పాటు కోలిండియాలో కార్మికుల హక్కుల కోసం అనేక పోరాటాలు నిర్వహిస్తూ కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి, శాఖ కార్యదర్శుల దృష్టికి కార్మికుల సమస్యలను తీసుకుపోయినట్లు చెప్పారు. ఇటీవల జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో కార్మికుల సమస్యలపై మాట్లాడినట్లు తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ వేతనాలు చెల్లించాలని, లాభాల్లో వాటా, వైద్య సదుపాయాల కల్పన, క్వాటర్ల కేటాయింపు అంశాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలుపొందిన కార్మిక సంఘాల నాయకులు కార్మికుల హక్కులను విస్మరించినట్లు ఆరోపించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. నాయకులు మాధవ నాయక్, అప్పాని శ్రీనివాస్, రాజిరెడ్డి, సారంగపాణి, రాజు, వెంకటస్వామి, మల్లయ్య, మల్లేష్, యూసఫ్ పాల్గొన్నారు.

# వన్యప్రాణుల దాహార్తి నివారణ చర్యలు



అటవీప్రాంతంలో వాగును పరిశీలిస్తున్న అధికారులు

కాటారం: వన్యప్రాణుల దాహార్తి తీర్చడం కోసం అటవీశాఖ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నారు. కాటారం అటవీశాఖ అధికారులు శనివారం కాటారం రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతంలో పర్యటించారు. వాగుల వద్ద ప్రత్యేకంగా చెలిమలు ఏర్పాటు చేయడంతో పాటు హోల్స్, ససర్‌పీట్‌లు తవ్వించారు. గ్రామపంచాయతీ వాటర్ ట్యాంకర్ల ద్వారా హోల్స్, ససర్‌పీట్‌లలో నీరు నింపించనున్నట్లు కాటారం ఎఫ్‌ఆర్‌ఓ స్వాతి తెలిపారు. వన్యప్రాణులకు తాగునీరు అందుబాటులో ఉండేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

**అటవీ చట్టాలపై అవగాహన..**

మండలంలోని చిద్నెపల్లిలో అటవీశాఖ ఆధ్వర్యంలో క్యాచ్ ది ట్రాప్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అటవీ చట్టాలపై అధికారులు అవగాహన కల్పించారు. వన్యప్రాణుల వేట చట్టరీత్యా నేరం అని ఉచ్చులు, విద్యుత్ తీగలు అమరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదాల గురించి వివరించారు. పశువుల, మేకల కాపర్లు అటవీ ప్రాంతంలో బీడీ, చుట్టా, సిగరేట్ వంటివి తాగవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌ఓ స్వాతి, డిప్యూటీ రేంజర్‌లు సురేందర్‌నాయక్, శ్రీనివాస్, ఎఫ్‌ఎస్‌ఓ చంద్రశేఖర్, ఎఫ్‌బీఓలు సంజీవ్, మోనాకౌసర్, రాజేందర్, జయలక్ష్మి, బేస్‌క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

# పంటలకు సాగునీరు అందించాలి



ఎండిన పొలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

- బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్

చిట్యాల: యాసంగిలో రైతులు పండిస్తున్న పంటలకు కాల్వల ద్వారా సాగు నీరు అందించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్, మాజీ జెడ్పీటీసీ గొర్రె సాగర్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మండలంలోని రైతుల పంటలను వారు పరిశీలించి మాట్లాడారు. భూగర్భ జలాలు అడుగంటి పంటలకు సాగు నీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రేగొండ నుంచి మండలంలోని పలు గ్రామాలకు ఉన్న కాల్వల ద్వారా ఎస్సారెస్పీ నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో పంటలకు నీరందించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ట సురేశ్, మండల ప్రధాన కార్యదర్శి ఎరుకొండ రాజేందర్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు పుట్టపాక మహేందర్, భద్రయ్య, మాజీ ఎంపీటీసీ జంబూల తిరుపతి, చంద్రమౌళి, దామెర రాజు, ఆనంద్ రెడ్డి, స్వామి దాస్‌తో పాటు రైతులు ఉన్నారు.

### ఒకరికి గాయాలు

రేగొండ: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయలైన ఘటన కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై షాఖాన్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లిగోరికి చెందిన ప్రకాశ్ ద్విచక్ర వాహనంపై పెట్రోల్ కోసం వెళ్తుండగా బస్టాండ్ వద్ద జూకారం వైపు నుంచి వస్తున్న ఓ ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. ప్రమాదంలో ప్రకాశ్ తలకు తీవ్ర గాయాలవడంతో చికిత్స కోసం హనుమకొండలోని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

టేకుమట్ల: వెంకట్రావుపల్లిలో కేక్ తినిపించుకుంటున్న మహిళలు



కాటారం: ఆదర్శ పాఠశాలలో సన్మానిస్తున్న డీఎస్పీ దంపతులు



# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

జిల్లా వ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో మహిళా ఉద్యోగులను తోటి ఉద్యోగులు సన్మానించారు. మొగుళ్లపల్లి మండలంలోని పర్లపల్లిలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



మొగుళ్లపల్లి: పర్లపల్లిలో మహిళా దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు



భూపాలపల్లి రూరల్: అంగన్‌వాడీ కేంద్రంలో..



మల్హర్: స్పెషల్ ఆఫీసర్ శ్రీజకు సన్మానం..




భూపాలపల్లి రూరల్: వేడుకల్లో మహిళలు



మొగుళ్లపల్లి: జీపీ కార్యదర్శులకు సన్మానం..



మొగుళ్లపల్లి: పారిశుద్ధ్య కార్మికురాలికి..



రేగొండ: మహాత్మాజ్యోతి బాపూలే పాఠశాలలో..



రేగొండ: వాణివిద్యానికేతన్‌లో పాఠశాలలో..



కాళేశ్వరం: కస్తూర్బా పాఠశాలలో..



చిట్యాల: కేక్ కట్ చేస్తున్న మహిళలు



చిట్యాలలో..



గిద్దెముత్తారంలో..



చల్లగరిగెలో..

## మంచు దుప్పటి



టేకుమట్లలో కురుస్తున్న పొగమంచు

టేకుమట్ల: నాలుగు రోజులుగా తెల్లవారు జామున చలి తీవ్రత పెరుగుతుండడంతో పాటు శనివారం ఉదయం నుంచి తొమ్మిది గంటల వరకు పొగమంచు కురిసింది. ఎండా కాలంలో పొగమంచు కురియడంతో ఉదయాన్నే కూలి పనులకు వెళ్లే కూలీలు, వాహనదారులు ఇబ్బందిపడ్డారు. పగలంతా ఎండ, తెల్లవారు జామున పొగమంచుతో చలికాలమా, ఎండాకాలమా ఇది ఏకాలమో అంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు.

### గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



గ్రాడ్యుయేషన్ వేడుకల్లో విద్యార్థులు

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని సన్ వ్యాలీ హైస్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రీ ప్రైమరీ యూకేజీ, ప్రైమరీ ఫస్ట్, 5వ, 6వ తరగతి విద్యార్థులకు పాఠశాల డైరెక్టర్లు జ్ఞాపికలతో పాటు ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ మైనాల సురేశ్, ప్రిన్సిపల్స్ మేనం సతీష్, వేముల శంకర్, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు పాల్గొన్నారు.